క్లుప్తంగా

గోగులమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో గోగులమ్మ

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అర్చకులు దీవి గోపాలకృష్ణమాచార్యులు శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

నూకాలమ్మ జాతర

చెరుకుపల్లి: ఆరుంబాక గ్రామంలోని గ్రామ దేవత నూకాలమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజామునే సుప్రభాత సేవలతో అభిషేక మహోత్సవాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి సారె, సద్దినైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వైభవంగా చెన్నకేశవుని కల్యాణం



రేపల్లె రూరల్: పేటేరు గ్రామంలోని భూసమేత చెన్నకేశవస్వామి తిరు కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి, దేవేర్లకు అర్చకులు మంగళస్నానాలు చేయించి పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో నెలకొల్పి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామిని ఆలయ ఈవో వెంకట అప్పలాచార్యులు, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ రవికిరణ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వేడుకలను తిలకించి పులకించారు.

నేడు శంకరన్ స్మారక సభ

బాపట్ల అర్బన్: దళితుల అభివృద్ధి కోసం నిర్విరామంగా, నిస్వార్థంగా సేవలందించిన నిరాడంబర అధికారి శంకరన్ అని ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు కొనియాడారు. రాష్ట్రంలో వెట్టి చాకిరీ నిర్మూలన అమలుకు శంకరన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కారంచేడు బాధితుల పునరావాసం, సఫాయి కర్మచారుల విముక్తి కోసం ఎంతో కృషి చేశారన్నారు. సోమవారం సాయంత్రం బాపట్ల టౌన్ హాలులో హైదరాబాద్ విశ్వ విద్యాలయం మాజీ ప్రొఫెసర్ శంకరన్ స్మారక సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సభకు ప్రముఖ పౌర హక్కుల నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, మానవ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ చక్రపాణి పాల్గొంటారని వెల్లడించారు.

భారీ అన్నసంతర్పణ

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రామ అధిష్ఠాన దేవత తల్లి దేవస్థానంలో ఆదివారం భారీ అన్నసంతర్పణ జరిగింది. ఎనిమిది వేల మందికిపైగా భక్తులు అమ్మ ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మన శ్యాంసుందర్ తెలిపారు. ఏటా కొండపాటూరు తిరునాళ్లకు ముందు రోజు అన్నసంతర్పణ ఉంటుందని వివరించారు. భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చక్రస్నానం ఉత్సవానికి పోలేరమ్మ తల్లి దేవస్థానం సారెను సమర్పించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను పేదలకు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉప్పాల నాగేశ్వరరావు, మానం ఆదినారాయణ, కల్లి శ్రీనివాస రావు, నరాలశెట్టి కృష్ణమూర్తి, బొమ్మిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

బాపట్లటౌన్: మండలంలోని నాగరాజు కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఆదివారం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ కథనం ప్రకారం నాగరాజు కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కొట్టుకువచ్చింది. మహిళ ఎరుపురంగు జాకెట్, బూడిద రంగు లంగా ధరించి ఉంది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద 'అన్నదాత సుఖీభవ' తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని పట్టణ వన్ టౌన్ సీఐ చంద్రశేఖర్ ప్రారంభించారు. వేసవి చివరి వరకు చలివేంద్రంలో మజ్జిగ, మినరల్ వాటర్ అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చలివేంద్రం నిర్వహణకు సహకరిస్తున్న వారికి ఓలేటి వెంకట ప్రతాప్ ధన్యవాదాలు తెలిపారు.

జగనన్నే మనందరి భవిష్యత్

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- వాడవాడలా ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం
- ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు


వేమూరు గ్రామంలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు/భట్టిప్రోలు/రేపల్లె/బాపట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, అందువల్ల ప్రజలందరూ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నారని, ఆయన మనందరి భవిష్యత్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. వేమూరులో ఆదివారం జరిగిన జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మేరుగ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు సెల్‌ఫోన్లకు స్టిక్కర్లను అంటించారు. అనంతరం మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ గృహ సారథులు సచివాలయ కన్వీనర్లు, నాయకులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరేలా సర్వే చేపట్టాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు, ప్రస్తుత సంక్షేమ సర్కారు పనితీరుకు గల తేడాను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మేరుగ ఆనందం వ్యక్తం చేశారు. కోగంటి లవ కుమార్, తలతోటి సువర్ణరావు, దొప్పలపూడి జ్యోతిబాబు, గుమ్మడి దానియేలు, ఉప సర్పంచ్ తలతోటి ప్రదీప్, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.


రేపల్లె 22వ వార్డులో గృహానికి స్టిక్కర్‌ను అతికిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త

- చుండూరు మండలం కారుమూరుపాలెంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు పాల్గొన్నారు.
- జేసీఎస్ భట్టిప్రోలు మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి) ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గొరిగపూడి పంచాయతీ పరిధిలోని వరికూటివారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి మల్లిక, సచివాలయ కన్వీనర్ వరికూటి వాసు, గరికపాటి వెంకటేశ్వరరావు, మాతంగి రవీంద్ర, భట్టిప్రోలు–1, 2 సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమాలలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, తలకొల యలమంద, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ కరీమ్, మద్దుల రామ్‌ప్రకాష్(రాముడు), చేబ్రోలు నాగార్జున, దాసరి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.
- రేపల్లె 25, 12 వార్డుల్లో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, 22వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ టి.కాశీవిశ్వనాథ గుప్త, మోర్లవారిపాలెంలో జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, తుమ్మలలో పార్టీ జిల్లా కార్యదర్శి గరికపాటి భానుకోటి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.
- బాపట్ల మండలంలోని మహాత్మాజీపురంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి ప్రారంభించారు. పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కారుమూరుపాలెం గ్రామంలో సర్వే చేస్తున్న కారుమూరు వెంకట రెడ్డి


రేపల్లె మండలం తుమ్మలలో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి భానుకోటి


బాపట్లలో స్టిక్కర్‌ను అంటిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి


భట్టిప్రోలు మండలం వరికూటివారిపాలెంలో..


భట్టిప్రోలులో..

భక్తిశ్రద్ధలతో ఈస్టర్


బాపట్లలోని చర్చిలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


భట్టిప్రోలులో పాస్కా జాగరణ మహోత్సవం


భట్టిప్రోలులో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నమస్కరిస్తున్న దృశ్యం

బాపట్ల/రేపల్లె/భట్టిప్రోలు/చెరుకుపల్లి/కర్లపాలెం: బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాపట్ల పట్టణంలోని హయ్యర్‌నగర్‌లోని హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చిలో రెవ డాక్టరు చింతా యేసురత్నం ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. బాపట్ల విద్యానగర్ ప్యారిస్ 2వ లైన్ హయ్యర్ లూథరన్ చర్చిలో రెవరెండ్ కె.బెంజిమెన్ చిన్నయ్య ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. చిన్నపిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాపట్ల పట్టణం సీబీజెడ్ చర్చిలో ఆదివారం ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి. ఉదయం సన్‌రైజ్ సర్వీస్ జరిగింది. రెవరెండ్ కె.దీన దయాల్ వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎం.రాహుల్ దేవ్, జె.క్రిస్టఫర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కె.రాఘవేంద్రరావు, ఎస్.బాలస్వామి, టి.ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు ఆటపాటలతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

- ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్(ఐఆర్ఈఎఫ్)చర్చిలో ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల అధినేత ఈస్టర్ సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇసుకపల్లిలోని ఏఈఎల్‌సీ టౌన్ లూథరన్ చర్చి, 24వ వార్డులోని జీసెస్ బ్లెసింగ్ చర్చి, గరువు మాత చర్చి, మండలంలోని నల్లూరుపాలెం, సింగుపాలెం, ఉప్పూడి, ఊలుపాలెం, కైతేపల్లి, పెనుమూడి, రుద్రవరం, పేటేరు, కారుమూరు, బేతపూడి తదితర గ్రామాలలోని చర్చిలలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
- భట్టిప్రోలు ఆర్‌సీఎం చర్చి, ఓలేరు పునీత శౌరీ ఆలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు పాస్కా జాగరణ మహోత్సవాలు నిర్వహించారు. విచారణ గురువులు రవి కుమార్ రెడ్డి, పూదోట విలియమ్స్ ఆధ్వర్యంలో సహాయక గురువులు జయరాజు, మార్టిన్, బెన్నీలు ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తి ప్రదక్షిణం, వాక్య పరిచర్య, బాప్తిస్మ పునఃప్రకటన, కృతజ్ఞతార్పన, అర్పణ, ప్రభు విందు స్వీకరణ, పాస్కా పండుగ జరిగాయి. భట్టిప్రోలు బేతేలు ప్రార్థనా మందిరంలో పాస్టర్ కె.అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.
- భట్టిప్రోలులోని సౌవార్తిక లూథరన్ సంఘం, క్రీస్తు లూథరన్ ఆలయం, రైలుపేటలలో నిర్వహించిన ప్రార్థనలలో గురుమండల అధ్యక్షులు రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ వాక్యోపదేశం చేశారు. పలువురు క్రైస్తవులు పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- చెరుకుపల్లి మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులు సమాధులను శుభ్రపరిచి ప్రత్యేకంగా అలంకరించారు. కర్లపాలెం మండలంలోని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు

నిజాంపట్నం: వాసవీ క్లబ్ నిజాంపట్నం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం అభినందనీయమని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ నిజాంపట్నం, రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం ఆధ్వర్యంలో శంకర్ కంటివైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హరనాథబాబు ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 295 మంది రోగులు పాల్గొన్నారు. 202 మంది శస్త్ర చికిత్సకు అనుమతి పొందారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీశంకర్, వైస్ చైర్మన్ బాబ్జీ, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, సెక్రటరీ హనుమాన్, గోపీ, మహేంద్రకుమార్, నాజర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


రమణమ్మకు వంట పాత్రల కిట్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు పోలీస్‌రావు, ఓబద్య

కర్లపాలెం: పూరిళ్లలో నివాసం ఉండే వారు అగ్నిప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ సంస్థ కర్లపాలెం మండల చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు తెలిపారు. కర్లపాలెం మండలం దుండివారిపాలెం పంచాయతీలోని అక్కిరాజుదిబ్బ కాలనీలో శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైన పూరింటి యజమాని రమణమ్మకు ఆదివారం రెడ్‌క్రాస్ సంస్థ తరఫున ఇనకొల్లు పోలీస్‌రావు ప్లాస్టిక్ టెంట్, నిత్యావసర సరుకుల కిట్ అందజేశారు. పోలీస్‌రావు మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కూడా చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి ఓబద్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే దివ్యాంగుల సంక్షేమం


సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామయ్య

బాపట్ల: వైఎస్సార్ సీపీతోనే దివ్యాంగుల సంక్షేమం సాధ్యమవుతోందని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య పేర్కొన్నారు. దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లా రామయ్య మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు నివేశన స్థలాలు మంజూరు చేయటంతో పాటు ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేసిందని గుర్తు చేశారు. పెన్షన్లు ప్రతి నెలా అందించటం వల్ల దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఏమీ సాయం చేయటం లేదని పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు గుంజి ఏడుకొండలు, అక్కల కృష్ణారెడ్డి, మద్దిబోయిన శ్రీనివాసరావు, పులి నారాయణరావు, చిమటా మార్పు, చల్లాపల్లి గోపి, యార్లగడ్డ కొండమ్మ, సబ్బువరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు రాజేశ్వరరావు

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సీపీఐ నాయకులు చండ్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వరరావు సేవలను కొనియాడారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రజా నాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలోని పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు గని, సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, పట్టణ కార్యదర్శి సాయి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బిళ్ళ రాజేష్, నాయకులు రవితేజ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

- నాణ్యమైన ఉపకరణాలే మేలు
- కరెంట్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి
- అవగాహన లేకే అధిక ప్రమాదాలు


ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

భట్టిప్రోలు: విద్యుత్ ప్రమాదాలకు నాణ్యమైన ఉపకరణాల వినియోగం, కరెంట్ వాడకంపై అవగాహన లేకపోవడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. వైరింగ్‌లో లోపాలు, నాసిరకం విద్యుత్ ఉపకరణాల వల్ల విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు సంభవించినప్పుడు షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. భట్టిప్రోలు మండల వ్యాప్తంగా 16,570 గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 2,300 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 19,650 కనెక్షన్లు ఉన్నాయి. ప్రధానంగా ఇంటికి వాడే విద్యుత్ తీగలు, ఉపకరణాలను ఐఎస్ఐ మార్కు కలిగినవే వాడాలని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల చాలావరకు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజ్‌పై పడకుండా చూసుకోవాలని, ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే అధిక లోడు వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయని చెబుతున్నారు. ఇంటి వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పాత వైరింగ్‌ను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని పేర్కొంటున్నారు. వేసవి దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నైపుణ్యంగల సిబ్బందితోనే వైరింగ్ చేయించాలి



ఇళ్లల్లో పాత వైరింగ్ ప్రమాదకరంగా ఉంటే తొలగించి కొత్త వైరింగ్ చేయించుకోవాలి. విద్యుత్ పనుల్లో నైపుణ్యం ఉన్న ఎలక్ట్రీషియన్‌తోనే చేయించాలి. సరైన ఎర్త్ లేకపోతే కొన్ని ఉపకరణాల ద్వారా కరెంట్ ప్రవహించే ప్రమాదం ఉంది. మూడు పిన్నులున్న ప్లగ్‌లు, సాకెట్లను మాత్రమే వాడాలి. ఒకే చోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించటం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది.
– ఎస్.భాస్కరరావు, ట్రాన్స్‌కో ఏడీఏ, రేపల్లె

మంగళగిరి ఎయిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 18వ వార్డుకు చెందిన భవిరిశెట్టి ధనలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో పది రోజుల నుంచి చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వార్డు వలంటీర్ రేష్మా అక్కడకు వెళ్ళి ఆమెకు వృద్ధాప్య పింఛన్‌ను ఆదివారం అందజేశారు.

రైలులో గుర్తుతెలియని మృతదేహం


గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన ప్రయాణికులు అధికారులకు సమాచారమందించారు. రేపల్లె నుంచి కాచిగూడ వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి ఎస్1, ఎస్2 బోగీల మధ్య లింక్ వద్ద ఉండే రేకుపై మృతదేహం ఉండడాన్ని ప్రయాణికులు గుర్తించారు. రైలు తెనాలికి చేరుకోగానే అధికారులు మృతదేహాన్ని రైలు నుంచి దింపి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండొచ్చు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నందివెలుగులో ఉచిత గుండె వైద్యశిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పవన్‌కుమార్

తెనాలిటౌన్: నందివెలుగులో మేముసైతం యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ విజయవాడ సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ ప్రారంభించారు. వైద్యశాలకు చెందిన కార్డియాలజిస్టు డాక్టర్ సాయిరెడ్డి బృందం వైద్యులు సుమారు 246 మందికి గుండె పరీక్షలు చేశారు. ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్, టీఎంటీ పరీక్షలు చేశారు. తీవ్రమైన సమస్యలుంటే శస్త్రచికిత్సలూ ఉచితంగా చేస్తామని డాక్టర్ సాయిరెడ్డి తెలిపారు. సర్పంచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మేముసైతం సభ్యులు చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో మేముసైతం అధ్యక్షులు కల్యాణం సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎర్రమోతు జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శి షేక్ షకూర్‌బాషా, నరసింహారావు, వెంకటనరసయ్య, హనుమంతరావు, కల్యాణ్‌కుమార్, సత్యనారాయణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చ

తెనాలిఅర్బన్: మానవతా మూర్తి ఎన్టీఆర్ అని వసుధ బసవేశ్వరరావు, చందు సాయిబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా జీవితంలో ఎన్టీఆర్ పారదర్శకత అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల నటులు తోట బసవయ్యతోపాటు వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో శత జయంత్యుత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, దేవరపల్లి భవానీ, గుమ్మడి ప్రసాద్, చింతలపూడి శ్రీనివాసరావు, పావులూరి శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ముంజేతుల్లో దివ్యౌషధం



వేసవి వచ్చిందంటే గుర్తొచ్చేది తాటిముంజెలు. ఉష్ణతాపం నుంచి ఇవి ఉపశమనం కలగజేస్తాయి. ఎండాకాలం వీటిని తినేందుకు అందరూ ఇష్టపడతారు. అనేక పోషకాలు ఉంటాయి కాబట్టి దీనిని ఐస్ యాపిల్ అని కూడా పిలుస్తారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో రహదారి వెంట తాటిముంజెలను విక్రయిస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. –భట్టిప్రోలు